క్లుప్తంగా

నేడు డయల్ యువర్ డీఎం

హయత్‌నగర్: హయత్‌నగర్ డిపోల పరిధిలోని ఆర్టీసీ ప్రయాణికుల సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించేందుకు, ప్రయాణికులకు మెరుగైన సేవలను అందించేందుకు వారి నుంచి సలహాలు, సూచనలు తీసుకునేందుకు సోమవారం డయల్‌యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు హయత్‌నగర్1 డీఎం రఘు ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 3 గంటల నుంచి 4 గంటల వరకు 7382800957కు ఫోన్ చేసి నేరుగా డీఎంతో మాట్లాడి తమ సమస్యలను వివరించవచ్చని ఆయన తెలిపారు.

కొనసాగుతున్న దీక్షలు

తలకొండపల్లి: గట్టుఇప్పలపల్లి గ్రామాన్ని మండలంగా ప్రకటించేంత వరకు పోరాటం ఆగదని వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గట్టుఇప్పలపల్లి గ్రామాన్ని మండలంగా ఏర్పాటు చేయాలని కోరుతూ జేఏసీ చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారం కూడా కొనసాగించారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులు దీక్షలో కూర్చున్నారు. అనంతరం దీక్షా శిబిరాన్ని శ్రీనివాస్‌రెడ్డి సందర్శించి మాట్లాడారు. మండల ఏర్పాటునకు కావాల్సిన మౌలిక సదుపాయాలు, వనరులు అన్ని ఉన్నాయని గుర్తుచేశారు. అభివృద్ధి పరంగా గట్టుఇప్పలపల్లి అన్ని రంగాల్లో ముందంజలో ఉందన్నారు. నాయకులు, అధికారుల్లో చిత్తశుద్ధి లోపించడంతోనే మండలం ఏర్పాటు కావట్లేదని ఆయన ప్రభుత్వాన్ని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలని కోరారు.

ఘనంగా బోనాలు


పాటిగూడలో బోనం ఎత్తుకున్న మహిళలు

తుర్కయంజాల్: పురపాలక సంఘం పరిధిలోని ఇంజాపూర్, రాగన్నగూడలోని పాటిగూడలో ఆదివారం బోనాలు ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. తుర్కయంజాల్‌లోని కట్టమైసమ్మ దేవాలయం వద్ద భక్తుల అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బీజేపీ మీడియా కన్వీనర్‌గా రవిరాథోడ్ నియామకం


రవిరాథోడ్‌కు నియామక పత్రం అందిస్తున్న ఆచారి

ఆమనగల్లు: కల్వకుర్తి అసెంబ్లీ నియోజక వర్గ బీజేపీ మీడియా కన్వీనర్‌గా ఆమనగల్లు మున్సిపాలిటీకి చెందిన రవిరాథోడ్‌ను నియమించారు. ఆమనగల్లు పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో జాతీయ బీసీ కమిషన్ సభ్యులు ఆచారి పాల్గొని మీడియా కన్వీనర్‌గా రవిరాథోడ్‌కు నియామకపు పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాంపల్‌నాయక్, కాసుల వెంకటేశ్, పరమేశ్‌గౌడ్, శ్రీనివాస్, పాషా, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

వీధిదీపాల ఏర్పాటు

తండాకు ఉప్పల ట్రస్టు చేయూత


ఎల్ఈడీ లైట్ల బిగింపు

ఆమనగల్లు: ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని పెంటతండాకు ఉప్పల చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో విద్యుత్ స్తంభాలకు ఎల్ఈడీ లైట్‌లను ఏర్పాటు చేసి చేయూతనందించారు. మున్సిపాలిటీ పరిధిలోని పెంటతండాకు హైదరాబాద్–శ్రీశైలం జాతీయ రహదారి నుంచి దాదాపు కిలోమీటరు దూరంలో ఉందని, వీధిదీపాలు లేకపోవడంతో రాత్రి వేళల్లో ఇబ్బందులు పడుతున్నామని ఆమనగల్లు మున్సిపల్ కౌన్సిలర్ కృష్ణనాయక్, నాయకులు కిషోర్‌నాయక్, శంకర్‌లు ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్, తలకొండపల్లి జెడ్పీటీసీ సభ్యులు ఉప్పల వెంకటేశ్ దృష్టికి తీసుకొచ్చారు. దీంతో వారు తండాకు వీధిదీపాలను ఏర్పాటు చేయించారు. కిశోర్‌నాయక్, శంకర్, కిరణ్, పరమేశ్, పాల్గొన్నారు.

వినూత్న నిరసన

మంచాల: మండల కార్యాలయం వద్ద ఆదివారం పంచాయతీ కార్మికులు చెవ్వులో పూవ్వులు పెట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కన్వీనర్ పోచమోని కృష్ణ మాట్లాడుతూ కార్మికుల సమస్యలను పట్టించుకోకపోవడం బాధాకరమని అన్నారు. ఖాజా పాష, భాస్కర్, రవి, శంకరయ్య, జంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

సోనూసూద్‌ను కలిసిన షాబుద్దీన్

కడ్తాల్: ప్రముఖ నటుడు సోనూసూద్ పుట్టిన రోజును పురస్కరించుకుని ఆదివారం ముంబై నగరంలోని ఆయన నివాసంలో మండల ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు షాబుద్దీన్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. తురుమ్ ఖాన్ నిర్మాత ఆసీఫ్ జానీ పాల్గొన్నారు.

అతిథికి..అతిథ్యమేది..?

- ప్రతిపాదనలకే పరిమితం
- పునరుద్ధరించని అటవీశాఖ అతిథిగృహం
- ఇబ్బందుల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు


ఆమనగల్లులో నక్సల్స్ పేల్చివేసిన అతిథిగృహ భవనం (ఫైల్)

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలో అతిథిగృహ నిర్మాణం ప్రతిపాదనలకే పరిమితమైంది. అతిథిగృహం లేకపోవడంతో ప్రజాప్రతినిధులు, అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఉన్న అతిథిగృహాన్ని నక్సల్స్ పేల్చివేశారు. దీంతో నేటికీ దానిని పునరుద్ధరించలేదు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో అతిథిగృహం నిర్మాణానికి చేసిన ప్రతిపాదనలు అలాగే ఉన్నాయి.

నాలుగు మండలాలకు కూడలి..

నాలుగు మండలాలకు కూడలిగా రాష్ట్ర రాజధానికి చేరువలో ఆమనగల్లు పట్టణంలో ఏ ఒక్క శాఖకు అతిథిగృహం లేదు. ఇక్కడికి మంత్రులు, ఉన్నత స్థాయి అధికారులు, ప్రముఖులు వచ్చినప్పుడు ఇబ్బందులు పడాల్సి వస్తుందని వారు చెబుతున్నారు. విశ్రాంతి తీసుకోవడానికి, భోజనం చేయడానికి, కాలకృత్యాలు తీర్చుకోవడానికి, ప్రెస్‌మీట్లు నిర్వహించడానికి ఇక్కట్లు ఎదురవుతున్నాయన్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో ఆమనగల్లు పట్టణ సమీపంలోని సూర్యలక్ష్మి కాటన్‌మిల్లులో ఉన్న అతిథి గృహాన్ని వినియోగించుకుంటున్నారు.

పునర్నిర్మాణానికి ప్రతిపాదనలు..

ఆమనగల్లు పట్టణంలోని అటవీశాఖ కార్యాలయ ఆవరణలోని అతిథి గృహాన్ని దాదాపు 25ఏళ్ల క్రితం నక్సలైట్లు పేల్చివేశారు. తిరిగి పునఃర్నిర్మాణానికి అటవీశాఖ ప్రతిపాదనలు చేసినప్పటికీ అవి ప్రతిపాదనలకే పరిమితమైంది. నేటికీ అటవీశాఖ అతిథి గృహాన్ని పునరుద్ధరించలేదు. అతిథిగృహం లేకపోవడంతో నూతనంగా ఆర్‌అండ్‌బీశాఖ ఆధ్వర్యంలో అతిథిగృహం నిర్మించాలని ఆమనగల్లు మండల సమావేశంలో తీర్మానం చేశారు. అయినప్పటికీ ఇప్పటివరకూ అతిథిగృహ నిర్మాణానికి నోచుకోలేదు. ఆమనగల్లు పట్టణంలో అతిథిగృహ నిర్మాణానికి అనువైన స్థలాలు ఉన్నప్పటికీ నిర్మాణానికి ఎవరూ చొరవ చూపలేదు. ఇప్పటికైనా ప్రజాప్రతినిదులు, అధికారులు చొరవ తీసుకుని అతిథిగృహం నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

అతిథిగృహం నిర్మించాలి



ఆమనగల్లు పట్టణంలో అతిథిగృహం వెంటనే నిర్మించాలి. అటవీశాఖ లేదా ఆర్‌అండ్‌బీ శాఖల ఆధ్వర్యంలో దీన్ని నిర్మించి ఇబ్బందులు తీర్చాలి. అతిథిగృహ నిర్మాణానికి అనువైనస్థలం కేటాయించి నిర్మాణానికి నిధులు మంజూరునకు ప్రజాప్రతినిధులు, అధికారులు కృషి చేయాలి.

– మండ్లి రాములు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు

ప్రతిపాదనలు పంపించాం..



ఆమనగల్లు పట్టణంలో అతిథిగృహ నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. ఆర్‌అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో అతిథిగృహం నిర్మించాలని స్థానిక ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డిల దృష్టికి తీసుకుపోయాం. అతిథిగృహ నిర్మాణానికి కృషి చేస్తున్నాం.

– అనిత, ఎంపీపీ, ఆమనగల్లు

ఆదిబట్ల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదిబట్ల మున్సిపాలిటీ మరియపురం, ఇందిరమ్మ కాలనీ, మన్నెగూడ ప్రాంతాలకు చెందిన 200 మంది ఇతర పార్టీలకు చెందిన కార్యకర్తలు ఆదిబట్ల మున్సిపాలిటీ బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు కొప్పు జంగయ్య ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పార్టీ శాలువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణలోనే ఆదిబట్ల మున్సిపాలిటీకి అత్యధిక నిధులు కేటాయించి అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. మౌలిక సదుపాయల కల్పనకు మరో రూ.10 కోట్లు త్వరలోనే కేటీఆర్ విడుదల చేయబోతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఆదిబట్ల మున్సిపాలిటీ కోఆప్షన్ సభ్యులు పల్లె గోపాల్‌గౌడ్, కోరే జంగయ్య, శ్రీనివాస్‌గౌడ్, టింగ్లికార్ రాజు, అమరేందర్, జయరాజ్, శౌరి, ఆరోగ్యమ్మ, స్వామి, రాజు, తదితరులు పాల్గొన్నారు.


మంచిరెడ్డి కిషన్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరుతున్న ఆదిబట్ల మున్సిపాలిటీ నాయకులు, కార్యకర్తలు

గ్రంథాలయాలు విజ్ఞాన బాంఢాగారాలు

- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు వెంకటరమణరెడ్డి
- గ్రంథాలయ భవన నిర్మాణానికి స్థల పరిశీలన


గ్రంథాలయ ఏర్పాటుకు స్థల పరిశీలన చేస్తున్న సత్తు వెంకటరమణరెడ్డి, తదితరులు

కడ్తాల్: గ్రంథాలయాలు విజ్ఞాన బాంఢాగారాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు వెంకటరమణరెడ్డి పేర్కొన్నారు. కడ్తాల్ మండల కేంద్రంలో రూ. కోటీ నిధులతో గ్రంథాలయ భవన నిర్మాణం చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలో గ్రంథాలయ భవన నిర్మాణానికి స్థానిక నాయకులతో కలిసి స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వెంకటరమణరెడ్డి మాట్లాడుతూ నిత్యం పుస్తక పఠనంతో మానసిక వికాసం, విజ్ఞానం పెంపొందుతుందని తెలిపారు. 2023–24 సంవత్సరానికి గాను జిల్లాలో రూ.10కోట్ల వ్యయంతో కడ్తాల్, మాడ్గుల్, మహేశ్వరం, గాయత్రినగర్, శేరిలింగంపల్లి, వనవస్థలిపురం, చేవేళ్ల, తుర్కయాంజాల్, కొందుర్గు మండల కేంద్రాల్లో గ్రంథాలయాల భవనాల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు చెప్పారు. గ్రంథాలయాలను నైపుణ్య శిక్షణ కేంద్రాలుగా తయారు చేసేందుకు కృషి చేస్తున్నట్లు వివరించారు. జిల్లాలో ఇప్పటి వరకు 30 గ్రామీణ గ్రంథాలయాలను ఏర్పాటు చేశామని, మరో 30 ఏర్పాటునకు అనుమతులు లభించినట్లు తెలిపారు. నిర్మాణం పూర్తయిన శంషాబాద్, ఆమనగల్లు, మంచాల మండల కేంద్రాల్లో త్వరలోనే ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. కొత్తూరు, షాబాద్, మండలాల్లో గ్రంథాలయాల నిర్మాణాలు శరవేగంగా సాగుతున్నాయని వివరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్తా, సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, ఉప సర్పంచ్ రామకృష్ణ, మండల రైతు బంధు అధ్యక్షుడు వీరయ్య, ఎంపీటీసీ లచ్చిరామ్‌నాయక్, జిల్లా గ్రంథాలయ కార్యదర్శి మనోజ్‌కుమార్ పాల్గొన్నారు.

‘పట్నం’లో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలి

టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి


రేవంత్‌రెడ్డిని కలిసిన నాయిని సుదర్శన్‌రెడ్డి

యాచారం: ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని, పార్టీ బలోపేతానికి ప్రతీ ఒక్కరు సమష్టి కృషి చేయాలని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సూచించారు. యాచారం మండల పీఏసీఎస్ మాజీ చైర్మన్ నాయిని సుదర్శన్ రెడ్డి ఆధ్వర్యంలో మండల కాంగ్రెస్ శ్రేణులు ఆదివారం నగరంలోని ఆయన నివాసంలో రేవంత్ రెడ్డిని కలిశారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని దీమా వ్యక్తం చేశారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో కాంగ్రెస్ క్యాడర్ బలంగా ఉందన్నారు. పార్టీలో గ్రూపు రాజకీయాలతో కార్యకర్తల్లో అయోమయం సృష్టించొద్దని హితవు పలికారు. రేవంత్‌రెడ్డిని కలిసిన వారిలో జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి ఉప్పల భాస్కర్, మండల అధ్యక్షుడు మస్కు నర్సింహా పాల్గొన్నారు.

ఎంపీని కలిసిన కాంగ్రెస్ శ్రేణులు..

భువనగిరి పార్లమెంట్ సభ్యుడు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కూడా యాచారం కాంగ్రెస్ శ్రేణులు కలిశారు. యాచారం గ్రామంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి కాలనీలో డ్రైనేజీ, కాల్వలు, సీసీ రోడ్ల సమస్యలపై ఎంపీకి వినతి పత్రం అందజేశారు. రూ.25లక్షల నిధులు మంజూరు చేయించాలని కోరారు.

గౌడ సంక్షేమసంఘం అధ్యక్షుడిగా నిరంజన్‌గౌడ్



ఆమనగల్లు: మండల గౌడ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా ఆమనగల్లు పట్టణానికి చెందిన చుక్క నిరంజన్‌గౌడ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కల్వకుర్తి అసెంబ్లీ నియోజక వర్గ గౌడసంక్షేమసంఘం అధ్యక్షుడు చుక్క అల్లాజీగౌడ్ ఆధ్వర్యంలో మండల కమిటీని ఎన్నుకున్నారు. గౌడసంక్షేమసంఘం అధ్యక్షుడిగా చుక్క నిరంజన్‌గౌడ్, గౌరవాధ్యక్షుడిగా అర్కలి నిరంజన్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా రమేశ్‌గౌడ్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా రాజేశ్‌గౌడ్, కోశాధికారిగా అయిల మహేశ్‌గౌడ్, ఉపాధ్యక్షుడిగా బాలరాజుగౌడ్, వెంకటయ్యగౌడ్, ఈదయ్యగౌడ్, ప్రచార కార్యదర్శిగా భానుప్రకాశ్‌గౌడ్, కార్యదర్శులుగా మహేశ్‌గౌడ్, మల్లేశ్‌గౌడ్‌లను ఎన్నుకున్నారు.

తలకొండపల్లి అధ్యక్షుడిగా బాలకుమార్‌గౌడ్..

తలకొండపల్లి మండల గౌడసంక్షేమసంఘం అధ్యక్షుడిగా బత్తుల బాలకుమార్‌గౌడ్, గౌరవాధ్యక్షుడిగా నర్సింహాగౌడ్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా అశోక్ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా గణేశ్‌గౌడ్, ప్రచార కార్య దర్శిగా విష్ణుగౌడ్, కోశాధికారిగా శ్రీనివాస్‌గౌడ్, ఉపాధ్యక్షులుగా స్వామిగౌడ్, శ్రీశైలంగౌడ్, ప్రదీప్‌కుమార్‌గౌడ్, మల్లేశ్‌గౌడ్, గోవర్ధన్‌గౌడ్, శేఖర్‌గౌడ్, పురుషోత్తంగౌడ్, కార్యదర్శులుగా వెంకట్‌గౌడ్, స త్యంగౌడ్, కొండల్‌గౌడ్, వెంకటయ్య, సత్యనారా యణ, మదారు, నర్సింహా, సురేశ్‌గౌడ్, మల్లేశ్‌గౌడ్, రమేశ్‌గౌడ్, కేశవులుగౌడ్‌లను ఎన్నుకున్నారు.

ప్రధానమంత్రి దిష్టిబొమ్మ దహనం


నిరసన వ్యక్తం చేస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

మంచాల: మణిపూర్‌లో ఆదివాసి మహిళలపై జరిగిన ఘటనను నిరసిస్తూ ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి బీరెన్ సింగ్ రాజీనామా చేయాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి అనగంటి వెంకటేష్ డిమాండ్ చేశారు. ఆదివారం మంచాల మండల కేంద్రంలో డీవైఎఫ్ఐ మంచాల చౌరస్తాలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ ప్రధాని మణిపూర్ సంఘటనపై 78 రోజులుగా ఎందుకు మౌనంగా ఉన్నారో ప్రజలకు వివరించాలన్నారు. రష్యా–ఉక్రెయిన్ యుద్ధం, టర్కీభూకంపం, గుజరాత్ వరదలపై స్పందించిన ప్రధాని ఈ విషయంలో ఎందుకు స్పందించడంలేదన్నారు. తక్షణమే ఈ సంఘటనపై ప్రధాని క్షమాపణ చెప్పాలన్నారు. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రిని బర్తరఫ్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి జగన్, మండల అధ్యక్ష, కార్యదర్శులు రామ కృష్ణ, స్వామి, హఫీజ్ పాష, సుధాకర్, ప్రహ్లాద్, వినోద్, మోతిలాల్ పాల్గొన్నారు.

గీత కార్మికుల సమస్యలు పరిష్కరిస్తాం

కడ్తాల్: కల్లుగీత కార్మికుల సమస్యలు పరిష్కరించి వారికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. ఆదివారం కడ్తాల్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గౌడ యువజన సంఘం నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన మాధారం మహేశ్‌గౌడ్‌ను ఎమ్మెల్యే సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం కుల వృత్తులకు, చేతి వృత్తుల సంక్షేమానికి ప్రత్యేక కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు బత్తుల ఆంజనేయులుగౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ వినోద్‌గౌడ్, జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమే

మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి


కాంగ్రెస్‌లో చేరిన బీజేపీ, బీఆర్‌ఎస్ నాయకులు

ఇబ్రహీంపట్నం రూరల్: తెలంగాణలో రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి స్పష్టం చేశారు. ఆదిబట్ల మున్సిపాలిటీ సాహేబ్‌గూడకు చెందిన బీఆర్‌ఎస్, బీజేపీకి చెందిన నాయకులు మాజీ కోఆప్షన్ సభ్యులు జహంగీర్‌ఖాన్ ఆధ్వర్యంలో మల్‌రెడ్డి రంగారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా మల్‌రెడ్డి రంగారెడ్డి వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ అరాచక పాలనకు చరమ గీతం పాడాల్సిన రోజులు దగ్గరపడ్డాయన్నారు. రాష్ట్రంలో తిరుగుబాటు మొదలైందన్నారు. కాంగ్రెస్ పార్టీ మూడు నెలల్లో అధికారంలోకి రాబోతుందని జోస్యం చెప్పారు. పోతురాజు రాముగౌడ్, జకంటి పవన్‌కల్యాణ్, రాఘవేందర్‌గౌడ్, శీలం నవీన్, బీజేపీ నుంచి బిక్షపతిగౌడ్, రాంబాబు, సురేష్, మహేష్, లక్ష్మిపతిలతో పాటు పెద్ద ఎత్తున చేరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మహిపాల్, సీనియన్ కాంగ్రెస్ నాయకులు శేఖర్‌గౌడ్, ఆదిబట్ల మున్సిపాలిటీ అధ్యక్షుడు గౌని బాల్‌రాజ్‌గౌడ్, పాండురంగా రెడ్డి, వీరేష్‌కుమార్, రమేష్, సురేష్, యాదగిరిలతో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్ల సమస్యలు పరిష్కరించాలి

జిల్లా ఫొటోగ్రాఫర్ల మహాసభ పోస్టర్ ఆవిష్కరణ


మహాసభల వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే, ఫొటోగ్రాఫర్‌ల సంఘం నాయకులు

కడ్తాల్: ఈ నెల 8న జరగనున్న జిల్లా ఫొటోగ్రాఫర్ల మహాసభను విజయవంతం చేయాలని సంఘం జిల్లా నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలో ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ నివాసంలో కడ్తాల్, ఆమనగల్లు, తలకొండపల్లి మండలాల ఫొటోగ్రాఫర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా మహాసభల వాల్‌పోస్టర్‌ను ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఫొటోగ్రాఫర్‌ల సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వారు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్ గుప్తా, సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, ఎంపీటీసీ లచ్చిరామ్‌నాయక్, ఫొటోగ్రాఫర్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు శివలింగం తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

ఇబ్రహీంపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ తలారి మల్లేశ్


బహుమతులు అందజేస్తున్న తలారి మల్లేశ్

యాచారం: క్రీడలతో మానసికోల్లాసంతో పాటు శరీర దారుఢ్యం బలపడుతుందని ఇబ్రహీంపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ తలారి మల్లేశ్ పేర్కొన్నారు. నెల రోజులుగా తక్కళ్లపల్లి గ్రామంలో జరిగిన ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా గెలుపొందిన క్రీడాకారుల జట్లకు మొదటి బహుమతి కింద రూ.10వేలు, ద్వీతియ బహుమతి రూ.5వేలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యువత చదువుపై కూడా ఆసక్తి పెంచుకోవాలన్నారు.

ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌కు టికెట్ ఇవ్వొద్దు

- కల్వకుర్తి బీఆర్‌ఎస్‌లో అసమ్మతిరాగం
- ఎమ్మెల్సీ కసిరెడ్డి, బాలాజీసింగ్, చిత్తరంజన్‌దాస్‌ల హాజరు


కందుకూరు ఫాంహౌస్‌లో జరిగిన సమావేశానికి హాజరైన అసమ్మతి నాయకులు

ఆమనగల్లు: కల్వకుర్తి బీఆర్‌ఎస్‌లో అసమ్మతి రోజురోజుకు పెరగడమే కాక ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌కు బీఆర్‌ఎస్ టికెట్ ఇవ్వొదని పలువురు నాయకులు డిమాండ్ చేస్తున్నారు. కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌కు వ్యతిరేకంగా నేతలు ఏకమవుతున్నారు. ఆదివారం రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలంలోని ఓ ఫాంహౌస్‌లో సమావేశం నిర్వహించారు. దీనికి ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి, మాజీ మంత్రి చిత్తరంజన్‌దాస్, నాగర్‌కర్నూల్ జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ బాలాజీసింగ్, తలకొండపల్లి జెడ్పీటీసీ సభ్యులు ఉప్పల వెంకటేశ్‌లతో పాటు దాదాపు 250 మంది హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు బీఆర్‌ఎస్ నాయకులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని, ప్రజల్లో రోజురోజుకు జైపాల్‌యాదవ్‌పట్ల వ్యతిరేకత పెరుగుతుందని పలువురు బీఆర్‌ఎస్ నాయకులు ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో జైపాల్‌యాదవ్‌కు టికెట్ ఇస్తే సహకరించేది లేదని వారు తీర్మాణించారు.

ఆర్టీసీ బస్సులను పునఃప్రారంభించాలి

ప్రైవేట్ వాహనాలే ప్రయాణికులకు దిక్కు

యాచారం: సాగర్ రోడ్డునుంచి ఆర్టీసీ బస్సులను పునః ప్రారంభించాలని ప్రయాణికులు పేర్కొన్నారు. యాచారం నుంచి తెల్లవారుజామున నగరానికి వెళ్లే ప్రయాణికులకు ప్రైవేట్ వాహనాలే దిక్కవుతున్నాయి. యాచారం మండల కేంద్రంనుంచి ఉదయం 5 గంటల నుంచి 6:30 గంటల మధ్యన 300 మందికి పైగా ప్రయాణికులు నగరానికి వెళ్లొస్తున్నారు. కోవిడ్ అనంతరం సాగర్‌రోడ్డుపై ఉదయం నడిచే బస్సులను ఆర్టీసీ నిలిపేసింది. నిత్యం యాచారం నుంచి వంద మందికి పైగా మహిళలు పూలను విక్రయించడానికి నగరానికి వెళ్తారు. ఆ సమయంలో బస్సులు లేకపోవడంతో వారు ప్రైవేట్ వాహనాలనే అనుసరిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందిచి ఆర్టీసీ బస్సులను పునఃరుద్ధరించాలని ప్రయాణికులు కోరారు.

సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీక ‘తీజ్’

ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్


కడ్తాల్: ముత్యాలమ్మ బోనాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

ఆమనగల్లు: సంస్కృతీ సంప్రదాయాలకు ‘తీజ్’ ప్రతీకగా నిలుస్తుందని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని సాకిబండ తండాలో ఆదివారం గిరిజనులు తీజ్ పండగను జరుపుకున్నారు. తీజ్ పండగలో పాల్గొన్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ సాకిబండ తండాలోని ముత్యాలమ్మగుడికి రూ.5లక్షలు, రోడ్డు మరమత్తుకు రూ.5లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. గిరిజన సంస్కృతీ, సంప్రదాయాలకు తీజ్ దోహదపడుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ తీజ్‌బుట్టను తలపై ఉంచుకుని గిరిజన యువతులతో కలిసి నృత్యం చేశారు. ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌ను గిరిజన నాయకులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆమనగల్లు జెడ్పీటీసీ అనురాధ, జిల్లా విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యులు పత్యానాయక్, ఎస్ఐ బాల్‌రాం, గోపినాయక్, హరినాయక్, బాలునాయక్, పత్యానాయక్, పాండునాయక్, పరమేశ్, తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి నిరుపేదలకు వరం

సీఎం సహాయనిధి నిరుపేదలకు వరమని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ పేర్కొన్నారు. మాడ్గుల మండలం కలకొండ గ్రామానికి చెందిన కుందమ్మకు రూ.75 వేలు, నాగిళ్ల గ్రామానికి చెందిన జంగమ్మకు రూ. లక్ష, తలకొండపల్లి గ్రామానికి చెందిన పెద్దయ్యకు రూ.1.25లక్షలు సీఎం సహాయనిధి పథకం కింద మంజూరయ్యాయి. వాటిని హైదరాబాద్‌లోని ఎమ్మెల్యేనివాసంలో ఆదివారం ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ మాట్లాడుతూ పేదలు ప్రభుత్వం అందించే ప్రతీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తలకొండపల్లి మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు ఏమిరెడ్డి జైపాల్‌రెడ్డి, మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్‌యాదవ్, వైస్ ఎంపీపీ జక్కు అనంతరెడ్డి, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు లక్ష్మీ నర్సింహారెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు పవన్‌కుమార్‌రెడ్డి, లచ్చిరాంనాయక్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ముత్యాలమ్మ బోనాలు

కడ్తాల్: కడ్తాల్ మండలం గోవిందాయిపల్లి తండాలో గిరిజనులు ముత్యాలమ్మ బోనాల పండగను ఆదివారం పూజారిశ చత్రునాయక్ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. తండాలోని గిరిజన మహిళలు పసుపు కుంకుమలతో అలంకరించిన బోనంతో గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా డీజే, డప్పుదరువుల హోరు, యువతి యువకుల నృత్యాలు, కోలాటం, గిరిజన మహిళల సాంప్రదాయ నృత్యాలు, పోతురాజుల వేశాధారణ విశేషంగా ఆకట్టుకున్నాయి. బోనాల ఉత్సవాలకు ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి, జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, ఐక్యత ఫౌండేషన్ నిర్వాహకులు వరప్రసాద్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్తా, సర్పంచ్‌లు రామునాయక్, ఎంపీటీసీ లచ్చిరామ్‌నాయక్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బీచ్యానాయక్, బీజేపీ మండల అధ్యక్షుడు మాన్యనాయక్ హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు.